సాక్షి
నిజామాబాద్

గురువారం । 2 । అక్టోబర్ । 2025



రైతులు అవకాశాలను..
విలువ ఆధారిత వస్తువులు తయారు చేసే అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఐఐఎం ఏ పరిశోధకులు శ్రీరామ్ సూచించారు.

- IIలో ▸



యువత డ్రగ్స్‌కు దూరంగా..
గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నల్గొండకు చెందిన టీచర్ రాచకొండ ప్రభాకర్ అన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
34.9 /21.1

వాతావరణం
ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు కిసాన్ మిలాప్



మోర్తాడ్(బాల్కొండ): రాజకీయ పార్టీలు, కుల మతాలకు అతీతంగా అన్నదాతల ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని శుక్రవారం ఆర్మూర్ వేదికగా నిర్వహించనున్నారు. దసరా సందర్భంగా అన్ని గ్రామాల రైతులను ఏకం చేస్తూ, వారి కష్టసుఖాలను స్వయంగా తెలుసుకునేందుకు వరుసగా రెండో సంవత్సరం 'కిసాన్ మిలాప్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట్ అన్వేశ్ రెడ్డి నేతృత్వంలో జిల్లాలోని అన్ని గ్రామాల రైతులను ఆహ్వానిస్తున్నారు. 'కిసాన్ మిలాప్' ద్వారా వ్యవసాయంలో జరుగుతున్న అభివృద్ధి, ఇబ్బందులు తెలుసుకోవడానికి అవకాశం ఉందని అన్వేశ్ రెడ్డి 'సాక్షి'తో తెలిపారు. ఈ కార్యక్రమం ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, కేవలం రైతుల కోసమే నిర్వహించే వినూత్న సమ్మేళనమని వివరించారు. రైతులు స్వయంగా హాజరుకావాలని కోరారు.

పండుగకు ముందే అందిన వేతనాలు
- బల్దియా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆనందం


నిజామాబాద్ సిటీ: ప్రతి నెలా 10వ తేదీ తరువాత అందే జీతాలు, ఇప్పుడు దసరాకు ముందు రోజే అందడంతో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బల్దియా చరిత్రలో ఎన్నడూ ఒకటో తేదీన జీతాలు అందలేదని అంటున్నారు. సిబ్బందికి ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలని కమిషనర్ దిలీప్‌కుమార్ అకౌంట్స్ సెక్షన్ అధికారులను ఆదేశించారు. దీంతో సెప్టెంబర్ 20వ తేదీ నాటికే ఉద్యోగుల హాజరు, వేతనాలను సిద్ధం చేశారు. గత నెల 28వ తేదీనే బ్యాంక్‌లో చెక్కులు డిపాజిట్ చేయడంతో 1వ తేదీన సిబ్బంది ఖాతాల్లో వేతనాలు జమయ్యాయి. దసరాకు ఒక రోజు ముందే జీతాలు అందడంతో ఉద్యోగులు, సిబ్బంది కమిషనర్ దిలీప్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విజయానికి ప్రతీక 'దసరా'



వేల్పూర్: జిల్లా, బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విజయదశమి (దసరా)శుభాకాంక్షలు తెలిపారు. విజయానికి ప్రతీకగా, అన్యాయంపై గెలుపునకు సంకేతంగా విజయదశమి జరుపుకుంటామన్నారు. చేపట్టిన ప్రతి పనిలో విజయం సాధించాలని, కుటుంబాల్లో ఆనందాలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

సీపీ శుభాకాంక్షలు..



ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు విజయదశమి పండుగ సందర్భంగా సీపీ పోతరాజు సాయి చైతన్య శుభాకాంక్షలు తెలిపారు. దుష్ట శక్తులపై విజయానికి సంకేతంగా జరుపుకునే ఈ పండుగను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలందరూ ఐక్యత, సమగ్రతల కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కుటుంబసభ్యులతో నిండు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కాలం గడపాలన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలలో శాంతి భద్రతలకు, మత విధ్వంసాలకు తావులేకుండా సహకరించాలని కోరారు. ప్రజలు, పోలీస్ సిబ్బంది స్నేహ పూర్వకంగా సోదర స్వభావంతో మెలగాలని సూచించారు.

బోధన్ రామ్‌లీలా మైదానంలో..
బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాం లీలా మైదానంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణుని ప్రతిమను తయారు చేయించారు. ఆనవాయితీ ప్రకారం జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి, రావణ ప్రతిమను దహనం చేస్తామని ఉత్సవ కమిటీ అధ్యక్షులు రేకం దాసు తెలిపారు.

బోధన్‌లో సిద్ధమవుతున్న రావణ ప్రతిమ



నిజామాబాద్ నగరంలో గుమ్మడికాయల విక్రయాలు



ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయంలో..
ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో నిర్వహించే దసరా వేడుకలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రతి సంవత్సరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రావణ సంహారం ప్రదర్శన ఆకర్షణగా నిలుస్తుంది. ఆర్మూర్ పట్టణానికి చెందిన వారితోపాటు పరిసర గ్రామాల ప్రజలు హాజరై ఉత్సవాల్లో పాల్గొంటారు. సర్వ సమాజ్ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించనున్నారు. జంబి హనుమాన్ ఆలయ ఆవరణకు రథం చేరుకోగానే రాముడు బాణం విసిరి రావణుని సంహరించే సన్నివేశం ప్రారంభమవుతుంది. రామరావణ యుద్ధం ముగిసిన తరువాత ప్రజలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఆర్మూర్‌లో నిర్వహించే దసరా ఉత్సవం కేవలం భక్తి, ఆచారం మాత్రమే కాదు, సమాజ బాంధవ్యాలను, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తుంది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు.

నవశక్తి

విజయాల దశమి
- నేటి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- ముస్తాబైన ఆలయాలు
- నిజామాబాద్, బోధన్, ఆర్మూర్‌లో రావణ దహనానికి ఏర్పాట్లు

విజయాలను అందించే విజయదశమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. మహిషాసురిడిని అమ్మవారు సహరించిందీ.. రావణుడితో యుద్ధం సమయంలో శ్రీరాముడికి సాక్షాత్కారం ఇచ్చింది దశమి రోజే. జిల్లా కేంద్రంలోని ఆలయాలతోపాటు ఆర్మూర్‌లోని జంబి హనుమాన్, బోధన్ పట్టణంలోని భీమునిగుట్టపై గురువారం నిర్వహించనున్న దసరా వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బుధవారం ఆయా ప్రాంతాల్లో మార్కెట్లు కిటకిటలాడాయి. వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం దసరా వేడుకలను సొంత ఊళ్లలో నిర్వహించుకునేందుకు వచ్చేశారు.



నగరంలో పండగ సందడి
నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రమైన నిజామాబాద్ నగరంలో దసరా సందడి నెలకొంది. వస్త్ర షోరూములు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పూలు, గుమ్మడి కాయల వ్యాపారం జోరుగాసాగింది. బుధవారం వాహన, ఆయుధ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం విజయ దశమి సందర్భంగా బ్రహ్మంగారి గుడి, జంబి హనుమాన్ ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయాల్లో శమీ పూజను నిర్వహించనున్నారు. అధికారులు విజయదశమికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు.

మూడు రోజుల్లో రూ.25 కోట్ల మద్యం..
- నేడు మూసి ఉండనున్న వైన్‌షాపులు
- మాంసం విక్రయాలూ బంద్
- రూ.3 కోట్ల విలువైన జీవాల విక్రయం



నగరంలోని వైన్‌షాపులో కొనుగోలుదారులు

ఖలీల్‌వాడి: జిల్లాలో మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు సాగాయి. మొత్తం 102 మద్యం దుకాణాలు ఉండగా, రోజుకు రూ.4.50 కోట్ల వ్యాపారం జరుగుతుంది. అయితే గురువారం దసరా ఉండగా, ఇదే రోజు గాంధీ జయంతి కావడంతో వైన్‌షాపులు, మాంసం దుకాణాలు మూసి ఉండనున్నాయి. దీంతో వైన్‌షాపుల వద్ద బారులు తీరారు. సోమ, మంగళ, బుధవారాల్లో రూ.25 కోట్ల విలువైన మద్యం విక్రయమైంది. సోమవారం రూ.4 కోట్లకు పై గా వ్యాపారం కాగా, మంగళవారం రూ.10.54 కోట్ల విలువైన, బుధవారం రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పైగా విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ వర్గాల ద్వారా తెలి సింది. గాంధీ జయంతి నేపథ్యంలో మద్యం దుకాణాలు మూసి ఉంటాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి స్పష్టం చేశారు.

గాంధీ జయంతి రోజున మాసం విక్రయం నిషేధమైనప్పటికీ.. దసరా ఉండడంతో మేకలు, గొర్రెల విక్రయాలు జోరుగా సాగాయి. నవీపేట్ మేకల సంతలో రూ.3 కోట్ల జీవాలు విక్రయమయ్యాయని అంచనా.

- దసరా వేడుకల కోసం స్వగ్రామానికి చేరుకున్న వ్యాపారవేత్త, రిటైర్డ్ ఏసీపీ
- మాక్లూర్ మండలం వల్లభాపూర్‌లో సందడి చేస్తున్న రెండు కుటుంబాలు

మాక్లూర్: జీవితంలో ఎంత బిజీ ఉన్నా సొంతూరులో దసరా వేడుకలు జరుపుకోవడం ఆ ఇద్దరికి ఎంతో ఇష్టం. తాము ఎంత బిజీ ఉన్నా, ఎక్కడ ఉన్నా.. గ్రామంతో, గ్రామస్తులతో ఉన్న అనుబంధం తమను లాక్కొస్తుందని అంటున్నారు మండలంలోని వల్లభాపూర్ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త జి సుధాకర్, రిటైర్డ్ ఏసీపీ గంగాధర్.

సుధాకర్ 35 ఏళ్ల క్రితం గ్రామం నుంచి వెళ్లి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తన మేనమామ, కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే జి సాయన్న సూచనల మేరకు మైన్స్ వ్యాపారంలోకి దిగి సక్సెస్ అయ్యారు. దసరా వేడుకలను మాత్రం గ్రామస్తులతో కలిసి చేసుకుంటున్నారు. గ్రామం కోసం ఏ సహాయం చేయడానికైనా ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఈ ఏడాది కూడా భార్యా పిల్లలతో కలిసి గ్రామానికి చేరుకున్న ఆయన గ్రామస్తులతో కలిసి సందడి చేస్తున్నారు. ప్రతి ఏడాది దసరాకు సొంతూరికి వచ్చి అందరినీ కలిసి వెళ్లడం ఆనందంగా ఉంటుందని సుధాకర్ అంటున్నారు.

గ్రామం నుంచి మొట్టమొదటి ప్రభుత్వ ఉద్యోగిగా ప్రత్యేక గుర్తింపు ఉన్న ఎస్ గంగాధర్ ఎస్సైగా విధుల్లో చేరి హైదరాబాద్‌లో సర్వీస్ పూర్తి చేశారు. ఏసీపీగా రిటైర్ అయిన ఆయన అక్కడే స్థిరపడ్డారు. రిటైర్ అయిన ప్రతి దసరాకు కుటుంబ సభ్యులతో కలిసి గ్రామానికి చేరుకుంటున్నారు. పిల్లలను మంచి చదువులు చది వించాలని గ్రామస్తులకు సూచించడంతోపాటు పేదలకు ప్రోత్సహకాలు అందజేస్తారు. ఈ ఏడాదిసైతం గ్రామానికి వచ్చిన ఆయన పిల్లలకు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. సర్వీస్‌లో ఉన్న సమయంలో చాలా ఏళ్లపాటు గ్రామానికి రాలేకపోయానని, ధ్యాసంతా గ్రామంపైనే ఉండేదని గంగాధర్ అంటున్నారు.

అనుబంధం.. ఆనందం



భార్యతో కలిసి గ్రామంలోని చిన్నారులకు బుక్స్, పెన్నులు అందజేస్తున్న రిటైర్డ్ ఏసీపీ గంగాధర్



భార్యాపిల్లలతో వ్యాపారవేత్త సుధాకర్

భీముని గుట్టపై..
బోధన్: పాండవులు నడియాడిన ప్రదేశంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న బోధన్ పట్టణంలోని రాకాసీపేట ప్రాంతంలోని భీమేశ్వరాలయం(భీమునిగుట్ట) విజయదశమి వేడుకలకు ముస్తాబైంది. ప్రతి ఏడాది దసరా వేడుకలను గుట్టపై ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్, ప్రస్తుత పట్టణ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ కుటుంబం ఆనవాయితీగా దశాబ్దాలుగా పట్టణ ప్రముఖులతో కలిసి హోమం, ఆయుధ, జమ్మిచెట్టుకు పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం సైతం దసరా ఉత్సవాలకు ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు చేసింది.

బకాసురుడి సంహారం

వనవాస సమయంలో పాండవులు ఏకచక్రపురం (బోధన్)లోని ఓ బ్రాహ్మణ కుటుంబం వద్ద ఆశ్రయం పొందారని, ఆ సమయంలో బకాసురుడు ప్రజలను పీడించే వాడని చరిత్రకారులు చెబుతారు. ప్రతి రోజూ బండెడు అన్నంతోపాటు ఓ వ్యక్తి ఆహారంగా వంతుల వారీగా వెళ్లాల్సి వచ్చేదని, ఈ క్రమంలో ఓ రోజు పాండవులకు ఆశ్రమిచ్చిన బ్రాహ్మణ కుటుంబం నుంచి ఆహారం, ఓ వ్యక్తి ఆహారంగా వెళ్లాల్సి రావడంతో ఆ కుటుంబం పాండవ రాజులకు తమ పరిస్థితిని మొరపెట్టుకున్నా రని, దీంతో భీమునిగుట్ట(భీమేశ్వరాలయం)పై భీముడు యుద్ధం చేసి బకాసురుడిని సంహరించాడని చెబుతారు.



ఆలయ ఆవరణలో జమ్మి చెట్టు



దశావతారాల్లో సర్వమంగళ..
సర్వమంగళ ప్రదాయిని, జగజ్జనని దశావతారాల రూపంలో చిన్నారులు ఆకట్టుకున్నారు. నిజామాబాద్ నగరంలోని గోనెరెడ్డి సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ మందిరం ఆవరణలో నెలకొల్పిన దుర్గామాత మండపంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనం ఇవ్వగా, చిన్నారులు అమ్మవారి దశావతారాలను ప్రదర్శించారు. సాయంత్రం మండపం వద్ద హోమం, కుంకుమార్చన నిర్వహించారు. భవానీ మాలధారులు అంతిరెడ్డి విజయపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రామ్‌రెడ్డి, సాయిరెడ్డి, సాగర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – నిజామాబాద్ రూరల్

వందేళ్లలో తొలిసారి..
- నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 237.9 టీఎంసీల ఇన్‌ఫ్లో
- గతంలో 1983లో 163 టీఎంసీలు చేరిక
- నెలన్నరగా పరవళ్లు తొక్కుతున్న మంజీర నది



నిండుకుండలా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు

నిజాంసాగర్: ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరదలు వచ్చాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 44 రోజుల వ్యవధిలోనే 237.9 టీఎంసీల ఇన్‌ఫ్లో రావడం గమనార్హం. వందేళ్ల చరిత్ర కలిగిన ప్రాజెక్టుకు ఈ స్థాయిలో వరదలు రావడం ఇది తొలిసారి..

నిజాం కాలంలో మంజీర నదిపై అచ్చంపేట వద్ద భారీ జలాశయం నిర్మాణం ప్రారంభించారు. 1923లో ప్రారంభమైన నిర్మాణం 1931లో పూర్తయ్యింది. కర్ణాటక, మహారాష్ట్రల్లో కురిసిన వర్షాలతోపాటు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురిసే వర్షాలతో ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతుంది.

ఆగస్టు 18న ప్రారంభమైన ఇన్‌ఫ్లో..

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈ ఏడాది ఆగస్టులో ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. ఆ నెలలో భారీ వర్షాలు కురవడంతో 111.53 టీఎంసీల నీరు వచ్చి చేరింది. సెప్టెంబర్‌లోనూ వరుణుడి జోరు కొనసాగడంతో మరో 126.41 టీఎంసీలు జత కలిసింది. మొత్తం 44 రోజుల వ్యవధిలో 237.94 టీఎంసీల ఇన్‌ఫ్లో రావడం గమనార్హం. వందేళ్ల ప్రాజెక్టు చరిత్రలో ఇది రికార్డ్ కావడం గమనార్హం. అంతకుముందు 1983 సంవత్సరంలో నిజాంసాగర్ ప్రాజెక్టు భారీ స్థాయిలో వరదలు వచ్చాయి. ఆ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కలిపి 163 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఆ తర్వాత ఈ స్థాయికి మించి వరదలు రావడం ఇదే తొలిసారి.

ఒక రోజులో రెండో అత్యధికం

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1962 సంవత్సరంలో భారీ వరదలు వచ్చాయి. ఒక రోజులో ప్రాజెక్టు చరిత్రలో గరిష్టంగా 4.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదయ్యింది. 1988 సంవత్సరంలో 2 లక్షల క్యూసెక్కులు వచ్చింది. ఆ తర్వాత ఎప్పుడూ ఒక రోజులో గరిష్ట ఇన్‌ఫ్లో 2 లక్షల క్యూసెక్కులు దాటలేదు. ఈసారి ఆగస్టు 28న 2.56 లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది.

లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు బుధవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,03,516 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు 15 గేట్లను ఎత్తి 1,00,056 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 1,402.40 అడుగులు (14.486 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

- ఇందూరు జిల్లాలో ఉరకలెత్తుతున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్
- కందకుర్తిలో సంఘ్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ మూలాలు జిల్లాకు గర్వకారణం
- హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థానంలో నిర్మాణంలో ఉన్న స్మృతి మందిరం
- సంఘ్ ఆధ్వర్యంలో 'పంచ పరివర్తన్' సూత్రాలతో శతాబ్ది ఉత్సవాలు
- నేడు 101వ వసంతంలోకి అడుగు పెట్టనున్న ఆర్ఎస్ఎస్

శతాబ్ది ప్రస్థానంలో కాషాయం రెపరెపలు

వందేళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) గురువారం 101వ వసంతంలోకి అడుగు పెట్టింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక, సాంస్కృతిక సంస్థగా ఉన్న ఆర్ఎస్ఎస్‌ను 1925లో విజయదశమి రోజున నాగ్‌పూర్‌లో ఐదుగురు పిల్లలతో కేశవ బలిరామ్ హెడ్గేవార్ స్థాపించారు. తరువాత కొన్నేళ్లకే ఇందూరు నగరంలోని గాజుల్‌పేట దత్తమందిర్‌లో 'ఇందూరు శాఖ'ను ప్రారంభించారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు నగరంలో 65 చోట్ల ఆర్ఎస్ఎస్ శాఖలు నడుస్తున్నాయి. ప్రతి బస్తీలో శాఖలు ఉండడంతో తెలంగాణలోనే సంపూర్ణ శాఖలున్న మొదటి నగరంగా నిలిచింది. జిల్లాలోని ఇతర మండలాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున శాఖలు విస్తరించాయి.

✤ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో 'పంచ పరివర్తన్' పేరిట (కుటుంబ ప్రబోధన, సామాజిక సమరసత, స్వ ఆధారిత జీవనం, బాధ్యతాయుత పౌరవిధులు, పర్యావరణ పరిరక్షణ) అనే అంశాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. మరో నెలపాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి.

✤ హెడ్గేవార్ తాతగారైన నరహరి శాస్త్రి 169 సంవత్సరాల క్రితం రెంజల్ మండలం కందకుర్తి నుంచి వేదపండితులకు ప్రాధాన్యత ఇచ్చే భోంస్లే సంస్థానమైన నాగ్‌పూర్‌కు వలస వెళ్లారు. ఈ క్రమంలో కందకుర్తిలో స్మృతిమందిరంగా ఉన్న వారి ఇంటి వద్ద ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 1989 నుంచి శ్రీ కేశవ శిశు విద్యామందిర్ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భరతమాత విగ్రహం, హెడ్గేవార్ కులదైవమైన చెన్నకేశవనాథ్ విగ్రహం, హెడ్గేవార్ విగ్రహం ప్రతిష్ఠించారు. కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో గోదావరి హారతి కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు.

శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థానంలో రూ.12 కోట్ల వ్యయంతో భారీ స్మృతి మందిరం నిర్మిస్తున్నారు. దీని వద్దనే గోదావరి ఒడ్డున మరో 10 ఎకరాల్లో కేశవ స్ఫూర్తి కేంద్రం, పాఠశాల, వసతిగృహం, భరతమాత ఆలయం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. పేద పిల్లలు, రైతులు, మహిళలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. పాఠశాలలో ముస్లిం విద్యార్థులు సైతం విద్యనభ్యసిస్తున్నారు.



స్వయంసేవకుల ఘోష్ ప్రదర్శన(ఫైల్)



అక్షరాస్యత పెంచడంలో..
1989లో శ్రీ కేశవ శిశు విద్యామందిర్‌ను ప్రారంభించారు. తరువాత 2004లో పాఠశాల నూతన భవనాన్ని అప్పటి సంఘ్ దక్షిణమధ్య క్షేత్ర కార్యకారిణి సదస్యులైన శ్రీరాంబావ్ హల్దేకర్ జీ ప్రారంభించారు. 2013 నుంచి కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ ల్యాబ్, ఈ-తరగతులు, ఎల్ఈడీ టీవీ సౌకర్యం కల్పించారు. ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నారు. మరోవైపు కందకుర్తి చుట్టుపక్కల గ్రామాల యువతీయువకులకు ఎండాకాలంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తున్నారు. కందకుర్తి గ్రామం నుంచి మొదటి సైనికుడిగా ఎంపికైన జుబెర్ బాషా, రెంజల్ మండలం నుంచి మొదటిసారిగా నావికాదళానికి ఎంపికైన శశివర్ధన్ ఈ పాఠశాలలోనే విద్యనభ్యసించారు. కేశవ సేవాసమితి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతోంది. చుట్టుపక్కల 19 గ్రామాల్లో బాలబాలికలలో సంస్కారం, చదువు కోసం బాల సంస్కార కేంద్రాలు, బాలికల కోసం కిశోరి వికాస్ కేంద్రాలు, ట్యూషన్ సెంటర్లు, పెద్దవారికి భజన మండళ్లు, గృహిణులకు మాతృ మండళ్లు, యువకులకు క్రీడాకేంద్రం, గ్రంథాలయం, నారాయణ సేవ వంటి కార్యక్రమాలు కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. దీంతో రెంజల్ మండలంలో అక్షరాస్యత గణనీయంగా పెరిగింది. పేద యువతకు చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు.

కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న కందకుర్తి గ్రామాన్ని ఇప్పటికే పలువురు సర్‌సంఘ్ చాలక్ (ఆర్ఎస్ఎస్ చీఫ్)లు సందర్శించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న స్మృతి మందిరం ప్రారంభానికి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భగవత్‌జీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ త్వరలో హాజరు కానున్నారు.

✤ కేశవ్ బలిరాం పంత్ హెడ్గేవార్ నాగ్‌పూర్‌లోనే జన్మించారు. కోల్‌కతాలో వైద్య విద్యనభ్యసించారు. బెంగాల్‌లో అనుశీలన సమితి, జుగాంతర్ మొదలైనవాటి ప్రభావానికి లోనయ్యారు. కాంగ్రెస్, హిందూ మహాసభలలో సభ్యుడిగా పనిచేశారు. దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నందుకు రెండుసార్లు జైలు శిక్ష అనుభవించారు. హెడ్గేవార్ వైద్య విద్య అభ్యసించినా.. సమాజంలో ఉన్న రుగ్మతలపై ఎక్కువగా దృష్టి సారించారు. దేశం విదేశీయుల చేతుల్లోకి వెళ్లిపోవడానికి హిందువులు కులాలవారీగా విడిపోయి కలహించుకోవడం, ఆత్మన్యూనతలో మునిగిపోవడం కారణాలుగా భావించిన ఆయన.. సమాజంలో ఐక్యత కోసం ఏదైనా చేయాలని నిర్ణయించుకుని ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారు. ఆయన నాటిన విత్తనం మొలకెత్తి అంచెలంచెలుగా ఎదిగి నేడు వటవృక్షమైంది. హెడ్గేవార్ 1940 జూన్ 21న మరణించారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి పూజలు



నిజామాబాద్ రూరల్: జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నగరంలోని గోనెరెడ్డి సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ మందిరంలో నెలకొల్పిన దుర్గామాత మందిరం వద్ద సాయంత్రం మండపం వద్ద హోమం, కుంకుమార్చన నిర్వహించారు.

బెటాలియన్‌లో ఆయుధపూజ



డిచ్‌పల్లి: మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్‌లో బుధవారం అధికారులు ఆయుధపూజ, వాహన పూజలు నిర్వహించారు. దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు శరత్ కుమార్, సత్యనారాయణ, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదింట్లో చదువుల 'భాగ్య'ం!

- ఎంబీబీఎస్ సీటు సాధించిన చాయ్‌వాలా కూతురు
- ఉన్నత చదువులే లక్ష్యమంటున్న విద్యార్థిని



తల్లిదండ్రులతో భాగ్యలక్ష్మి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వాళ్లది నిరుపేద కుటుంబం. తండ్రి హోటల్‌లో చాయ్ తయారు చేస్తాడు. తల్లి బట్టలు కుడుతుంది. ముగ్గురు కూతుళ్లు. ఇద్దరిని టెన్త్, ఇంటర్ వరకు చదివించి పెళ్లి చేసేశారు. చిన్న కూతురు ప్రభుత్వ బడిలో పదో తరగతి వరకు చదివి 9.8 జీపీఏ సాధించింది. ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన ఆమె, పట్టుదలతో చదివి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. వివరాల్లోకి వెళితే... సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌కు చెందిన మడపతి నాగయ్యస్వామి, శ్రీశైల దంపతుల కూతురైన భాగ్యలక్ష్మి సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకొని పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించింది. దీంతో బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అక్కడికి వెళ్లి జాయిన్ అయిన వారం రోజులకే ఆ చదువు తనకొద్దంటూ ఇంటికి వచ్చేసింది. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అప్పటికే ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవుతుండడంతో కామారెడ్డిలోని సాందీపని కాలేజీలో చేర్పించారు. తండ్రి నాగయ్య స్వామి కామారెడ్డి పట్టణంలోని ఓ హోటల్‌లో చాయ్ తయారు చేసే పనిలో చేరాడు. తల్లి ఇంటి దగ్గర ఉంటూ కూతురు చదువు చూసుకుంది. బైపీసీ బాగా చదివితే డాక్టర్ అవుతావంటూ ప్రోత్సహించింది. ఇంటర్‌లో 992 మార్కులు వచ్చాయి. కాలేజీ అధ్యాపకుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారంతో భాగ్యలక్ష్మి నీట్ రాసి 406 మార్కులు సంపాదించింది. దీంతో మొదట నిర్మల్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. రెండో విడత కౌన్సిలింగ్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌లో సీటు సాధించింది.

అమ్మ ప్రోత్సాహం ఎక్కువ..

మా నాన్న మా కోసం ఎంతో కష్టపడతాడు. అమ్మ రోజూ చదువుకోమంటూ ఎంతగానో ప్రోత్సహించింది. మెడిసిన్ సీటు సాధించాలంటూ నిత్యం గుర్తు చేస్తూ ఎంకరేజ్ చేసింది. సాందీపని కాలేజీ అధ్యాపకుల సహకారంతో మెడిసిన్ సీటు సాధించాను. ఎంబీబీఎస్ చదివిన తర్వాత కచ్చితంగా పీజీ కూడా సాధిస్తా. న్యూరో లేదా కార్డియాలజీ విభాగంలో సీటు సాధించి మంచి డాక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తా. – భాగ్యలక్ష్మి, విద్యార్థిని

రైతులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి


- ఐఐఎంఏ పరిశోధకులు శ్రీరామ్
- రైతు ఉత్పత్తిదారుల సంఘం సందర్శన



పసుపు ఉత్పత్తులు పరిశీలిస్తున్న శ్రీరామ్

జక్రాన్‌పల్లి : విలువ ఆధారిత వస్తువులు తయారు చేసే అవకాశాలను రైతులు అందిపుచ్చుకోవాలని ఐఐఎంఏ(అహ్మదాబాద్) పరిశోధకులు శ్రీరామ్ సూచించారు. మండలంలోని మనోహరాబాద్ గ్రామంలోని జేఎంకేపీఎం రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోని ఒకే ఒక్క టర్మరిక్ క్లస్టర్‌ను మారుమూల ప్రాంతమైన మనోహరాబాద్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పసుపుతో ఎన్నో రకాల ఉత్పత్తులను తయారు చేయొచ్చని, దానిపై పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. అందులో భాగంగానే జిల్లాలోని పసుపు రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు పట్కూరి తిరుపతిరెడ్డి, నవ్యభారతి గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ సంతోష్ పాల్గొన్నారు.

పురాతన కట్టడాలు.. గత వైభవపు ఆనవాళ్లు



బాన్సువాడ బండగల్లీలోని బురుజు

బాన్సువాడ రూరల్: ఆనాటి సంస్థానాధీశులు తమ ఆధీనంలోని రాజ్యాన్ని శత్రువుల బారి నుంచి కాపాడుకునేందుకు కాపాలా కోసం పెద్ద పెద్ద బుర్జు(గడీ)లను నిర్మించారు. వృత్తాకార, చతురస్రాకార, దీర్ఘచతురస్రాకారాల్లో బురుజులను బండరాళ్ల 20 నుంచి 25 మీటర్ల ఎత్తులో మట్టి, సున్నంతో కలిపి నిర్మించారు. వీటిపైకి ఎక్కడానికి ఒకరు లేదా ఇద్దరు మాత్రమే వెళ్లడానికి మార్గం ఉంటుంది. వీటిపై నుంచి చూస్తే గ్రామ పొలిమేరలు స్పష్టంగా కనిపిస్తాయి. బురుజుల పై భాగంలో చుట్టూ రంధ్రాలుండే రాళ్లతో కూడిన కట్టడం ఉంటుంది. వీటిలో నుంచి సైన్యం తుపాకులను శత్రు సైన్యంపై ఎక్కు పెట్టేవారని పూర్వీకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పాతబాన్సువాడ, బండగల్లీతో పాటు దేశాయిపేట్, పాత బాన్సువాడ, పోచారం, రాంపూర్, ఇబ్రహీంపేట్, బోర్లం, హన్మాజీపేట్, కోనాపూర్, సంగోజీపేట్ తదితర గ్రామాల్లో ఇప్పటికి బుర్జులు చెక్కుచెదరకుండా ఉన్నాయి. దసరా పండుగ నాడు వీటిపై జెండాలు ఎగురవేస్తారు. పోచారం గ్రామంలో ప్రతిఏటా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తమ ఇంటి ఆవరణలో ఉన్న బురుజుపై ఉన్న దస్తగిర్ దర్గాలో ఆనవాయితీగా ప్రార్థన చేసి దసరా ఉత్సవాలను ప్రారంభిస్తారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- బైక్ యాత్రకు స్వాగతం

నిజామాబాద్ లీగల్: గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలంటూ నల్గొండ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ చేపట్టిన బైక్ యాత్ర బుధవారం జిల్లాకు చేరుకుంది. సూర్యాపేట జిల్లా గోరంట్ల జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రభాకర్ తన స్నేహితుడు గంజాయి వాడకంతో మృతి చెందడంపై కలత చెందాడు. దీంతో గంజాయి, డ్రగ్స్ వాడకంతో కలుగుతున్న అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సొంత ఖర్చుతో రాష్ట్ర వ్యాప్తంగా బైక్ యాత్ర నిర్వహిస్తున్నాడు. యాత్రలో భాగంగా రద్దీ ప్రదేశాలు, సంతలు, మార్కెట్లలో ప్రభాకర్ ఓ ప్రత్యేకమైన నల్లని షర్టు వేసుకుని, దానిపై పుర్రె గుర్తు ఉన్న దండ ధరించి గంజాయి, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. సెప్టెంబర్ 21న ప్రారంభమైన ఈ యాత్ర బుధవారం నిర్మల్ జిల్లా బాసర మీదుగా నిజామాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభాకర్‌కు నిజామాబాద్ కోర్టు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య, నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి మాణిక్ రాజ్, అడ్వొకేట్లు మాడవేడి శ్యామ్‌కుమార్, రవిప్రసాద్, ఆశా నారాయణ, రెంజర్ల సురేశ్ స్వాగతం పలికారు. యాత్ర నిర్వహణపై అభినందిస్తూ ప్రభాకర్‌ను సన్మానించారు.



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న సీఐ శ్రీనివాసరాజు, న్యాయవాదులు

వేదాంత ఆచార్య పరీక్షలో తొలి ర్యాంక్

- గురుసిద్ధ మణికంఠ శివాచార్యుల చారిత్రక రికార్డు



బోధన్: బోధన్ వాసి, మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా లక్ష్మీదహివడి బార్సీ త్రిమఠాధిపతి గురుసిద్ధ మణికంఠ శివాచార్యులు వేదాంత ఆచార్య జాతీయస్థాయి పరీక్షలో తొలిర్యాంక్ సాధించారు. ప్రతిష్టాత్మకమైన వారణాసి సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం ఇటీవల ఫలితాలు విడుదల చేసింది. ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయం కు లపతి అనురాధా బేన్ చేతుల మీదుగా స్వర్ణ పతకం అందుకోనున్నారు. ఆధ్యాత్మిక సేవ లో తరిస్తున్న మణికంఠ శివాచార్యులు ఈ ఏడాది మూడు సంపూర్ణానంద స్వర్ణ పత కాలు, స్వామి మాధవాచార్య స్వర్ణ పతకం, అన్నదా ప్రసాద్ ముఖర్జీ స్వర్ణ పతకం సా ధించి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. 1973లో కాశీ జగద్గురువు చంద్రశేఖర శివాచార్యులు మూడు స్వర్ణ పతకాలు, 1996లో శ్రీశైలం జగద్గురువు డాక్టర్ చెన్న సిద్ధరాం పండితారాధ్య శివాచార్యులు రెండు స్వర్ణ పతకాలు అందుకున్నారు. అదే పరంపరంలో గురుసిద్ధ మణికంఠ శివాచార్యులు ఒకే ఏడాదిలో మూడు స్వర్ణ పతకాలు అందుకోనుండడం విశేషం.

గాంధీ జయంతి నాడే దసరా

- మాంసం విక్రయించొద్దని మున్సిపల్ అధికారుల నోటీసులు
- బెల్టుషాపులలో మద్యం స్టాక్ ఫుల్

బిచ్కుంద(జుక్కల్): ఉద్యోగ, ఉపాధి, వ్యాపారం నిమిత్తం పట్టణాలకు వెళ్లిన వారు దసరా పండుగకు స్వగ్రామాలకు చేరుకున్నారు. బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. వాహనాలు, యంత్రాలకు పూజలు చేసి మాంసంతో వంటకాలు, మిత్రులతో కలిసి మద్యం సేవించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. కాగా, ఈసారి గాంధీ జయంతి రోజునే దసరా పండుగ వచ్చింది. దీంతో జీవహింస చేయొద్దని, మద్యం దుకాణాలను మూసి ఉంచాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. అయితే, పండుగ రోజు కూడా మద్యం, మాంసం ముక్క లేకుంటే ఎలా అంటూ ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.



నోటీసులు అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మాంసం దుకాణాలకు నోటీసులు

ఈ నెల 2న గురువారం గాంధీ జయంతి సందర్భంగా మేకలు, కోళ్ల జీవహింస చేయవద్దని బుధవారం మున్సిపల్ అధికారులు మాంసం విక్రయ దుకాణదారులు, హోటళ్లకు నోటీసులు అందజేశారు. హోటళ్లలో సైతం మాంసం కూర వండరాదన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



చికెన్ కొనుగోలు చేస్తున్న స్థానికులు

బెల్టుషాపులలో స్టాక్...

గాంధీ జయంతి రోజున మద్యం విక్రయాలపై గ్రామాలలో అంతగా పట్టింపు ఉండదనే ఉద్దేశంతో బెల్టుషాపుల నిర్వాహకులు మద్యం బాటిళ్లను నిల్వచేసి పెట్టారు. పట్టణ, మండల కేంద్రాల నుంచి బెల్టు షాపులకు వచ్చి కొనుగోలు చేస్తారనే ఉద్దేశంతో బ్రాండెడ్ మద్యాన్ని తెచ్చిపెట్టినట్లు తెలిసింది. వైన్స్‌లు బంద్ ఉండడంతో అధిక ధరలకు విక్రయించి లాభం పొందవచ్చని నిర్వాహకులు భావిస్తున్నారు.

ప్రయాణం భారం..

- బస్సులు నడవక ఇబ్బందులు
- కామారెడ్డి, ఎల్లారెడ్డికి వెళ్లాలంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిందే
- పండుగల పూట ప్రయాణికులకు అవస్థలు

లింగంపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో నెల రోజులుగా రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ఆగస్టు 27 నుంచి దాదాపు నెల రోజులకుపైగా కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లింగంపేట మండలం లక్ష్మాపూర్, అడ్విలింగాల వద్ద రోడ్డు కొట్టుకుపోయాయి. నాగిరెడ్డిపేట మీదుగా మెదక్, హైదరాబాద్ వెళ్లేదారిలో పోచారం ప్రాజెక్టు కింద వంతెనకు ఇరువైపులా రోడ్డు దెబ్బతిన్నది. దీంతో వారం, పది రోజులు రాకపోకలు నిలిచి ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం స్పందించి తాత్కాలికంగా మొరం వేసి రోడ్లు మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించారు. లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) వద్ద పాముల వాగు వంతెన, రోడ్డు కొట్టుకు పోవడంతో కామారెడ్డి నుంచి లింగంపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్‌కు ప్రతి రోజు నడిచే బస్సులను అధికారులు నిలిపివేశారు. సుమారు నెల పది రోజులు అవుతున్నా బస్సులు నడపడంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కామారెడ్డి నుంచి గాంధారి, నల్లమడుగు మీదుగా లింగంపేట, ఎల్లారెడ్డి మీదుగా పిట్లంకు మూడు బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సుల్లో వెళ్లాలంటే 30 కిలోమీటర్ల మేర దూరం, ఆర్థిక భారం పెరుగుతుంది. కామారెడ్డి నుంచి లింగంపేట మండలం పొల్కంపేట చౌరస్తా వరకు బస్సులు నడుపుతున్నారు. అక్కడి నుంచి ప్రయాణికులు మూడు కిలోమీటర్ల మేర ఆటోల్లో వెళ్లాల్సి వస్తుంది. ఇదే అదనుగా ప్రైవేటు వాహనాల్లో రెట్టింపు చార్జీ వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో ఆర్థిక భారం, దూరం, సమయం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు. అయితే, రాకపోకలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు మరో 15 రోజులు పట్టవచ్చని అధికారులు చెప్తున్నారు.



లింగంపల్లి పాముల వాగు వద్ద కొనసాగుతున్న డైవర్షన్ రోడ్డు పనులు

అవస్థలు పడుతున్నాం



నెల రోజులుగా పొల్కంపేట వైపు బస్సులు రావడంలేదు. దీంతో లింగంపేటకు నడిచి వెళ్తున్నాం. ప్రైవేటు వాహనాల్లో చార్జీలు ఎక్కువగా తీసుకుంటున్నారు. నిత్యావసర సరుకులు, బట్టలు, పండుగ సామన్ల కొనుగోలుకు లింగంపేట వెళ్లాల్సి ఉంటుంది. పాముల వాగు వద్ద రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి.

– కంల్యానాయక్(ఒంటర్‌పల్లి)

నడవాల్సి వస్తోంది..



పొల్కంపేట రూట్‌లో బస్సులు నడపకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వివిధ పనుల నిమిత్తం లింగంపేట, కామారెడ్డికి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో మూడు, నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తుంది. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలంటే చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారు.

–వస్రాం(సురాయిపల్లి తండా)

క్రైం కార్నర్

చెరువులో పడి వ్యక్తి మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన జోగిని చిన్న మల్లయ్య(62) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. మృతుడు రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. బతుకమ్మ పండుగకు స్వగ్రామం వచ్చాడు. సెప్టెంబర్ 28న డబ్బుల విషయంలో భార్యతో గొడవపడి రంగంపేటలోని తన పెద్ద కొడుకు వద్దకు వెళ్లాడు. తిరిగి 30వ తేదీన అయిలాపూర్‌కు చేరుకున్నాడు. ఇంటికి వెళ్లకుండా గ్రామం పక్కనే ఉన్న చెరువులో బట్టలు ఉతుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటమునిగి చనిపోయినట్లు ఎస్సై పేర్కొన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పది నెలలకే నూరేళ్లు..

- జ్వరంతో బాలుడు మృతి



బాలుని మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మాచారెడ్డి : జ్వరంతో బాధపడుతూ పది నెలల బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని సర్దాపూర్ తండాలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్దాపూర్ తండాకు చెందిన బానోత్ అశోక్, వెన్నెల దంపతుల కుమారుడు వేదాంశ్(10 నెలలు) జ్వరంతో ఐదురోజులుగా బాధపడుతున్నాడు. దీంతో రాజన్నసిరిసిల్లా జిల్లా కేంద్రంలోని ఓ పిల్లల ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉందని నీలోఫర్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిరచారు.

వివాహిత ఆత్మహత్య

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన మమత(38) వరద కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై శైలేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మమత కొన్నాళ్లుగా కుటుంబకలహాలతో సతమతమవుతోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జీవితంపై విరక్తి చెంది ఎస్సారెస్పీ నుంచి ప్రవహించే వరద కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బస్సు, కారు ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని లలిత ఆశ్రమం దగ్గర జాతీయ రహదారిపై బుధవారం ఆర్టీసీ బస్సు, కారును ఢీ కొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వరరావుపేట గ్రామానికి చెందిన దుంపల సాయికుమార్ మారుతి స్విఫ్ట్ డిజైర్ కారులో మోర్తాడ్ నుంచి రాజేశ్వరరావుపేటకు వెళ్తున్నాడు. కమ్మర్‌పల్లి పరిధిలోని లలిత ఆశ్రమం దగ్గర ఎదురుగా వస్తున్న కరీంనగర్ డిపో–2కు చెందిన ఆర్టీసీ బస్సు సాయికుమార్ కారును ఢీకొట్టింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, సాయికుమార్ కుడి చేయికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఇటుక టిప్పర్

- ఒకరికి తీవ్రగాయాలు



గాయపడ్డ సాయిలు

మాక్లూర్: బైక్‌ను వెనుక నుంచి ఇటుక టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ..మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన కల్లెం నడ్పి సాయిలు బుధవారం ద్విచక్ర వాహనంపై నవీపేట మండలం కమలాపూర్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. మెట్‌పల్లి, వల్లభాపూర్ గ్రామాల మధ్యలో వెనుక నుండి వస్తున్న మినీ టిప్పర్ బలంగా ఢీకొట్టింది. దీంతో కల్లెం నడ్పి సాయిలు కాలు విరిగింది. గమనించిన వాహనదారులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

రూ.2 వేల కోసం హత్య

- నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఒకటో టౌన్ పోలీసులు

ఖలీల్‌వాడి: రూ.2 వేల కోసం హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 6న నిజామాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీనివాస కిరాణా షాప్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు. అనుమానితుడైన నవీపేట మండలం జల్లపల్లి ఫారానికి చెందిన షేక్ అహ్మద్‌ను సెప్టెంబర్ 30న పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. షేక్ అహ్మద్ నగరంలోని రైల్వే స్టేషన్ పరిసరాల్లో నివసిస్తూ క్యాటరింగ్‌తోపాటు రోజువారీ కూలీ పనులు చేసేవాడు. మద్యం అలవాటు నేపథ్యంలో రైల్వేస్టేషన్ వద్ద ఒంటరిగా కనిపించే వ్యక్తులను బెదిరించి డబ్బులు దోచుకునే వాడు. గత నెల 6న అర్ధరాత్రి రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీనివాస కిరాణా షాప్ ఎదుట ఒక వృద్ధుడు డబ్బులు లెక్కబెడుతూ కనిపించగా దోచుకోవాలనే ఉద్దేశంతో అహ్మద్ అతని దగ్గరకు వెళ్లాడు. డబ్బులివ్వాలని బెదిరించగా వృద్ధుడు ఇవ్వలేదు. దీంతో అహ్మద్ ఒక బట్టతో వృద్ధుడి మెడకు ఉరి బిగించి హత్య చేశాడు. అనంతరం అతని వద్ద నుంచి రూ.2 వేల నగదు, ఫోన్ దోచుకున్నట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

వివాహితపై సామూహిక అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులో వచ్చిన ఘటన

నిజామాబాద్ రూరల్: వివాహితపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన వివాహిత నగరంలోని ఆటోనగర్‌లో నివాసం ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన మోయిన్‌తో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సెప్టెంబర్ 10న ఆమెతోపాటు ఏడు సంవత్సరాల కుమారుడిని రూరల్ మండలంలోని ఓ గ్రామంలో అద్దె ఇంట్లో ఉంచాడు. అదే సమయంలో వివాహితపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం వివాహితను వాళ్ల అక్క వద్ద ఉంచాడు. సెప్టెంబర్ 27న ఆమెను నాగారం తీసుకెళ్లి మౌల్‌సాబ్‌ను కలిసి వస్తానని చెప్పి నిందితుడు పరారయ్యాడు.ఈ నేపథ్యంలో తనపై మోయిన్, అతని స్నేహితులు కయూమ్, అమీర్ కలిసి అత్యాచారం చేశారని బాధితురాలు సోమవారం పేర్కొన్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.కాగా, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.



నేటి నుంచి ప్రైమ్ వాలీబాల్ లీగ్

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నేడు హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. టోర్నీలో మొత్తం 10 జట్లు బరిలోకి దిగుతున్నాయి. నాలుగో సీజన్ పోటీల్లో భాగంగా జరిగే తొలి పోరులో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ తలపడుతుంది. మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదిక కాగా, అక్టోబర్ 26న ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో లీగ్ సహ వ్యవస్థాపకుడు తుహిన్ మిశ్రా, సీఈఓ జాయ్ భట్టాచార్య తదితరులు పాల్గొని టోర్నీ వివరాలను ప్రకటించారు. గత మూడు సీజన్లతో పోలిస్తే ఈసారి లీగ్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగిందని, టోర్నీని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు వెల్లడించారు. మరోవైపు హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు పీవీఎల్ సీజన్ కోసం కొత్త జెర్సీని రూపొందించింది. తెలంగాణలోని ప్రఖ్యాత పోచంపల్లి ఇక్కత్ డిజైనింగ్ స్ఫూర్తిగా దీనిని తయారు చేసినట్లు టీమ్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వెల్లడించారు.



ఆస్ట్రేలియా బోణీ

- యాష్లే గార్డ్‌నర్ సెంచరీ
- 89 పరుగులతో ఓడిన న్యూజిలాండ్

ఇండోర్: మహిళల వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. న్యూజిలాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 89 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 326 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యాష్లే గార్డ్‌నర్ (83 బంతుల్లో 115; 16 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సెంచరీ సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో లీ తహుహు, జెస్ కెర్ 3 వికెట్ల చొప్పున... బ్రీ ఇల్లింగ్, అమెలియా కెర్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. 327 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 43.2 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ సోఫీ డివైన్ (112 బంతుల్లో 111; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) వీరోచిత సెంచరీ సాధించినా ఫలితం లేకపోయింది. ఆసీస్ బౌలర్లలో సోఫీ, అనాబెల్ 3 వికెట్ల చొప్పున తీశారు. కొలంబోలో నేడు జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ తలపడుతుంది.

'ట్రోఫీ కావాలంటే వచ్చి తీసుకెళ్లండి'

ఆసియా కప్‌పై నఖ్వీ మంకుపట్టు

దుబాయ్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీని అందించకుండా అట్టి పెట్టుకున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మన్ మొహసిన్ నఖ్వీ మళ్లీ తన దురుద్దేశాన్ని బయటపెట్టాడు. టీమిండియాకు ట్రోఫీ కావాలంటే ఆసియా క్రికెట్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి తీసుకోవచ్చని, అయితే అప్పుడు కూడా తానే ఇస్తానని అతను తన మొండితనాన్ని ప్రదర్శించాడు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్, కేంద్ర మంత్రి కూడా అయిన నఖ్వీ నుంచి తాము ట్రోఫీని అందుకోమని ఫైనల్ తర్వాత స్పష్టం చేసిన భారత జట్టు... కప్ లేకుండానే స్వదేశానికి వెళ్లిపోయింది. దాంతో నఖ్వీపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

- నేటి నుంచి వెస్టిండీస్‌తో తొలి టెస్టు
- జోరు మీదున్న గిల్ బృందం
- సంచలనంపై విండీస్ ఆశలు
- ఉదయం గం. 9:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సొంతగడ్డపై టెస్టుల్లో భారత్ దాదాపు 12 ఏళ్ల పాటు ఎదురులేని జట్టుగా ఒక్క సిరీస్ కూడా ఓడిపోకుండా ఆధిపత్యం ప్రదర్శించింది. పర్యటనకు వచ్చిన పెద్ద జట్లు కూడా టీమిండియా జోరును ఆపలేకపోయాయి. అయితే పుష్కర కాలం తర్వాత బలహీనం అనుకున్న న్యూజిలాండ్ పెద్ద దెబ్బ కొట్టింది. గత ఏడాది అనూహ్యంగా కివీస్ చేతిలో భారత్ క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఆ తర్వాత ఇప్పుడు మళ్లీ మన టీమ్ స్వదేశంలో టెస్టు మ్యాచ్ బరిలోకి దిగుతోంది. ఈసారి కూడా బలహీనమైన వెస్టిండీస్ ఎదురుగా ఉంది. ఇంగ్లండ్‌పై చక్కటి ప్రదర్శన తర్వాత ఎలాంటి ఉదాసీనతకు తావు ఇవ్వకుండా ఆడితే విండీస్‌పై పైచేయి ఖాయం. ఈ నేపథ్యంలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు రంగం సిద్ధమైంది.

అహ్మదాబాద్: శుబ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు సొంతగడ్డపై తొలి టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేటి నుంచి మొదటి టెస్టు జరుగుతుంది. సీనియర్లు కోహ్లి, రోహిత్, అశ్విన్‌ల రిటైర్మెంట్ తర్వాత టీమిండియా స్వదేశంలో ఆడనున్న మొదటి టెస్టు ఇదే కానుంది. ఇంగ్లండ్ గడ్డపై అద్భుత ఆటతో సిరీస్‌ను సమం చేసుకున్న టీమిండియా పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు ఆసీస్‌తో ఆడిన గత టెస్టులో '27 ఆలౌట్' తర్వాత విండీస్ ఇదే మ్యాచ్‌లో బరిలోకి దిగుతోంది. బలాబలాల్లో ఎంతో అంతరం కనిపిస్తుండగా, కరీబియన్ టీమ్ ఇక్కడ ఏమాత్రం పోటీనిస్తుందనేది సందేహమే.

అదనపు పేసర్‌తో...

సాధారణంగా స్వదేశంలో నల్లరేగడి మట్టితో సిద్ధం చేసే స్పిన్ అనుకూల పిచ్‌లపై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి టీమ్ మేనేజ్‌మెంట్ ఉద్దేశపూర్వకంగా పేస్‌కు అనుకూలించే 'ఎర్ర మట్టి' పిచ్‌పై తమ సత్తాను పరీక్షించుకోవాలని భావిస్తోంది. దీని ప్రకారమే తుది జట్టు ఉండవచ్చు. ఇద్దరు ప్రధాన పేసర్లుగా బుమ్రా, సిరాజ్ ఖాయం. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, సుందర్ ఖాయం. అయితే మూడో స్పిన్నర్ అయిన కుల్దీప్, మరో పేసర్ మధ్య పోటీ ఉండవచ్చు. పిచ్‌ను బట్టి చూస్తే ప్రసిధ్ వైపే మొగ్గు కనిపిస్తోంది. అయితే ఆరో స్థానంలో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డిని ఆడిస్తే అప్పుడు కుల్దీప్‌కు అవకాశం ఉంటుంది. నితీశ్ జట్టులోకి వస్తే బ్యాటర్ పడిక్కల్‌ను కూడా పక్కన పెట్టాల్సి రావచ్చు. ఇంగ్లండ్‌లో పెద్దగా ఆకట్టుకోకపోయినా నితీశ్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. బ్యాటింగ్‌పరంగా యశస్వి, గిల్, రాహుల్ చక్కటి ఫామ్‌లో ఉండగా సుదర్శన్ కూడా ఇటీవల ఆస్ట్రేలియా 'ఎ'పై సత్తా చాటాడు.



గిల్

అందరూ అంతంతే!

'మా గెలుపుపై ఎవరికీ అంచనాలు లేకపోవడమే మా బలం. ఓటమి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడతాం. కివీస్‌ను ఆదర్శంగా తీసుకుంటాం' అని వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ ఛేజ్ చెబుతున్నాడు. కానీ భారత్‌లో టెస్టులు అంటే ఎంతో కష్టమో విండీస్‌కు బాగా తెలుసు. 1994లో భారత్‌ను ఓడించిన తర్వాత ఇక్కడ ఆడిన 10 టెస్టుల్లో విండీస్ 8 ఓడి, 2 'డ్రా' చేసుకుంది. 2018లో ఆడిన సిరీస్‌లో 2 టెస్టులూ మూడు రోజులకే ముగిశాయి! పట్టుదలగా క్రీజ్‌లో నిలబడి జట్టును నడిపించగల బ్యాటర్ ఎవరూ కనిపించడం లేదు. హోప్, ఛేజ్, వారికన్‌లకు మాత్రమే ఇక్కడ ఆడిన అనుభవం ఉండగా, జేడెన్ సీల్స్ ఇటీవల ఆకట్టుకుంటున్నాడు. ప్రధాన పేసర్లు అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్ గాయంతో సిరీస్‌కు దూరం కావడం పెద్ద లోటు. విండీస్ కూడా ముగ్గురు పేసర్లతో ఆడనుంది.



రోస్టన్ ఛేజ్

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, జురేల్, నితీశ్ రెడ్డి/పడిక్కల్, జడేజా, సుందర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్/ప్రసిధ్. **వెస్టిండీస్:** ఛేజ్ (కెప్టెన్), చందర్‌పాల్, కెవ్లాన్ అండర్సన్, అతనజె, బ్రెండన్ కింగ్, షై హోప్, గ్రీవ్స్, పైర్, వారికన్, ఫిలిప్ అండర్సన్, సీల్స్.

పిచ్, వాతావరణం

పిచ్‌పై పచ్చికను ఎక్కువగా ఉంచారు. పేస్ బౌలింగ్‌కు అనుకూలం కాగా బ్యాటర్లు పట్టుదల కనబర్చాల్సి ఉంది. నగరంలో అనూహ్యంగా కురుస్తున్న వర్షాలు మ్యాచ్‌కు స్వల్పంగా అంతరాయం కలిగించవచ్చు.

అభిషేక్ అదుర్స్

టి20 ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత ఓపెనర్



దుబాయ్: ఇటీవల ముగిసిన ఆసియాకప్ టి20 టోర్నమెంట్‌లో దంచికొట్టిన భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. ఈ ఫార్మాట్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన ప్లేయర్‌గా అభిషేక్ రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 931 రేటింగ్ పాయింట్లతో 'టాప్'లో నిలిచాడు. 2020లో ఇంగ్లండ్ ప్లేయర్ డేవిడ్ మలాన్ 919 రేటింగ్ పాయింట్లు సాధించి రికార్డు సృష్టించగా... ఐదేళ్ల తర్వాత దాన్ని అభిషేక్ సవరించాడు. టీమిండియా తరఫున గతంలో సూర్యకుమార్ యాదవ్ 912 రేటింగ్ పాయింట్లు, విరాట్ కోహ్లి 909 రేటింగ్ పాయింట్లు సాధించగా... ఇప్పుడు అభిషేక్ ఆ ఇద్దరినీ దాటేసి అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న ఫిల్ సాల్ట్ (844 పాయింట్లు) కంటే అభిషేక్ 82 రేటింగ్ పాయింట్లు ముందున్నాడు. పాకిస్తాన్‌తో ఆసియా కప్ ఫైనల్లో అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించిన హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (819 పాయింట్లు) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (698 పాయింట్లు) రెండు స్థానాలు కోల్పోయి 8వ ర్యాంక్‌లో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (803 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా (233 పాయింట్లు) 'టాప్' ర్యాంక్ నుంచి రెండో స్థానానికి చేరగా... పాకిస్తాన్ ప్లేయర్ సయీమ్ అయూబ్ (241 పాయింట్లు) నాలుగు ర్యాంక్‌లు మెరుగుపరుచుకొని అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆసియాకప్‌లో బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయిన అయూబ్ బంతితో 8 వికెట్లు తీశాడు.

ముకేశ్‌కు పసిడి పతకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నీని భారత్ 'టాప్' ర్యాంక్‌తో ముగించింది. చివరిరోజు బుధవారం భారత్‌కు మూడు పతకాలు లభించాయి. జూనియర్ పురుషుల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ షూటర్ ముకేశ్ నేలవల్లి స్వర్ణ పతకాన్ని సాధించాడు. గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ 585 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. భారత్‌కే చెందిన సాహిల్ 573 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. ఈ టోర్నీలో ముకేశ్‌కిది రెండో పతకం. అంతకుముందు ముకేశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో రజతం గెలిచాడు. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ తేజస్విని 30 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా భారత్ 8 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఓజీ విజయం నా ఒక్కడిది కాదు - పవన్ కల్యాణ్

"'ఓజీ' సినిమా విజయం నా ఒక్కడిది కాదు.. ఇందుకు కారణమైన మా టీమ్‌కి ధన్యవాదాలు'' అని పవన్ కల్యాణ్ చెప్పారు. ఆయన హీరోగా, ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 25న రిలీజ్ అయ్యింది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్'లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ– ''ఓ మూవీ ఫెయిల్యూర్‌కి నేనెప్పుడూ భయపడలేదు. ఇటీవల విడుదలైన 'హరి హర వీరమల్లు' సినిమాకి కూడా. నేను చాలా సార్లు ఫెయిల్ అయింది టీమ్ వర్క్ లేకే తప్ప నా ఎఫర్ట్స్ ఎప్పుడూ తగ్గవు. నాకు అన్నం పెట్టిన తల్లి సినిమా. ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా నేనున్నానంటే అది సినిమా ఇచ్చిందే. ఓడిపోతే నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు.. సినిమా అపజయమైతే ఆ నిస్సహాయత ఎలా ఉంటుందో తెలుసు. సినిమా బాగున్నప్పుడు అందరూ ఉంటారు కానీ, బాగాలేనప్పుడు మన దగ్గర ఎవరు నిలబడతారో వాళ్లే మనవాళ్లు. నేనెప్పుడూ ఫెయిల్యూర్‌ని ఎదుగుదలకు ఒక మెట్టుగా చూస్తానే తప్ప అవరోధంగా చూడను. నేను సినిమా కంటే పెద్దది చేస్తున్నాను.. అదే రాజకీయం. చాలా కష్టమైన పని. సినిమాల్లో విలన్స్‌తో గొడవ పడటం ఈజీ. నిజ జీవితంలో అలా ఉండదు.. తల ఎగిరిపోవచ్చు కూడా. అది నాకు ఎక్స్‌ట్రా రిస్క్. కానీ, దేశంపై నాకు పిచ్చి ప్రేమ ఉంది. అందరి హీరోల సినిమాలు చూస్తాను. ప్రతి హీరో కష్టాన్ని నేను అభినందిస్తాను. అందరి హీరోల అభిమానులను నేను కోరుకునేది ఒక్కటే. ఫ్యాన్ వాయిస్‌ని ఆపేయండి.. అలాంటి స్లోగన్స్‌తో దయచేసి సినిమాని చంపేయకండి. ఇప్పుడు ఓ సినిమా జీవితం అనేది కేవలం ఆరు రోజులు అయిపోయింది. నిర్మాతలు సినిమాలు చేసేందుకు ముందుకు రాకపోతే ఎంతోమంది ఉపాధి కోల్పోతారు'' అన్నారు.



సుజీత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య, తమన్

శశిరేఖ పరిచయం

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్ లైన్. 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే... ఈ చిత్రంలో నయనతార చేస్తున్న శశిరేఖ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సమీర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. కృష్ణ, లైన్ ప్రొడ్యూసర్: నవీన్ గారపాటి.




నయనతార



సోనాక్షీ సిన్హా

సుధీర్ బాబు, సోనాక్షీ సిన్హా లీడ్ రోల్స్‌లో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్-ఇండియా ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ధన పిశాచిగా కనిపిస్తారు సోనాక్షీ సిన్హా. ఈ పాత్రకు సంబంధించిన 'ధన పిశాచి...' పాటను విడుదల చేశారు. సమీరా కొప్పికర్ స్వరపరచిన ఈ పాటకు శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించగా, సాహితీ చాగంటి ఆలపించారు. దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా నిర్మించారు. నవంబరు 7న హిందీ, తెలుగు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

మాస్ జాతర ఫిక్స్



రవితేజ

రవితేజ హీరోగా నటించిన 'మాస్ జాతర' చిత్రం కొత్త విడుదల తేదీ ఖరారు అయింది. ఈ నెల 31న ఈ చిత్రం విడుదల కానుంది. రవితేజ నటించిన 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రవితేజ–శ్రీలీల రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. పలుమార్లు విడుదల వాయిదా పడ్డ ఈ చిత్రాన్ని ఈ నెల 31 విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ''వింటేజ్ వైబ్స్, పక్కా కమర్షియల్ అంశాలతో రూపొందిన చిత్రం 'మాస్ జాతర'. మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా వాణిజ్య అంశాలతో అసలైన పండగ సినిమాలా ఈ చిత్రాన్ని తీశారు భాను భోగవరపు. రవితేజను ఎలా చూడాలని అభిమానులు, ప్రేక్షకులు కోరుకుంటారో అందుకు తగ్గట్టుగానే అందరూ మెచ్చేలా మాస్ రాజాను తెరపై చూపించారాయన. మా సినిమా థియేటర్లలో అసలు సిసలైన మాస్ పండగను తీసుకురాబోతోంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, సంగీతం: భీమ్స్.

నిశ్చితార్థానికి వేళాయె



అల్లు శిరీష్

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తనయుడు, హీరో అల్లు శిరీష్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. ఈ నెల 31న నయనికతో తన నిశ్చితార్థం జరగనున్నట్లు బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు శిరీష్. కాబోయే భార్యతో ఈఫిల్ టవర్ వద్ద దిగిన ఓ ఫొటోను (చేతులు మాత్రమే కనిపించేలా) పంచుకున్నారు. ''మా తాత అల్లు రామలింగయ్య జయంతి (అక్టోబరు 1) సందర్భంగా నా మనసుకు దగ్గరైన ఒక విషయాన్ని అందరితో పంచుకుంటున్నాను. నేను, నయనిక ఈ నెల 31న నిశ్చితార్థం చేసుకోబోతున్నాం. ఇటీవల కన్నుమూసిన మా నానమ్మ కనకరత్నంగారు ఎప్పుడూ నేను పెళ్లి చేసుకోవాలని కోరుకునేవారు. ఇప్పుడు ఆమె మా మధ్య లేకపోయినప్పటికీ మమ్మల్ని ఆమె ఆశీర్వదిస్తారని నమ్ముతున్నాను'' అంటూ పోస్ట్ చేశారు. నయనిక హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి అని టాక్. అయితే ఆమె గురించి పూర్తి వివరాలు మాత్రం తెలియాల్సి ఉంది.

సరికొత్త విలయ తాండవం



ఆకాశ్ పూరి, కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, పార్వతి అరుణ్, 'పుష్ప' మూవీ ఫేమ్ జగదీష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విలయ తాండవం'. వీఎస్ వాసు దర్శకత్వంలో జీఎంఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై మందల ధర్మారావు, గుంపు భాస్కరరావు నిర్మించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హీరో ఆకాశ్ పూరి, డైరెక్టర్ భీమనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''విలయ తాండవం' టైటిల్ ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంది. టైటిల్ పోస్టర్ చూస్తుంటే గూస్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. ''నేను తీసిన 'కౌసల్యా కృష్ణమూర్తి' చిత్రంలో కార్తీక్ నటించాడు. 'విలయ తాండవం'తో తనకి మరో హిట్ రావాలి'' అన్నారు భీమనేని శ్రీనివాసరావు. ''సరికొత్త పాయింట్, కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ వాసు'' అని కార్తీక్ రాజు చెప్పారు. ''అద్భుతమైన కథతో ఈ సినిమా తీశాం'' అన్నారు మందల ధర్మా రావు, గుంపు భాస్కర రావు, వీఎస్ వాసు.

వేట షురూ



గుణి, తరుణ్ భాస్కర్, వేణు

టినూ ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని, విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి ప్రధాన పాత్రల్లో రూపొందనున్న చిత్రం 'బా బా బ్లాక్ షీప్'. గుణి మంచికంటి దర్శకత్వంలో దోణెపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోణెపూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన కథ, కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ ఓ మోషన్ పోస్టర్‌ను డైరెక్టర్ తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా రిలీజ్ చేయించారు. ''గన్స్, గోల్డ్ చుట్టూ జరిగే వేట.. ముగ్గురి తెలివితేటలు... ఒక రోజులో జరిగే ఘటనలు... ఓ ఆరుగురి ప్రయాణంతో న్యూ ఏజ్ క్రైమ్ కామెడీగా ఈ చిత్రం రాబోతోంది'' అని యూనిట్ పేర్కొంది.

టీజర్ చాలా బాగుంది - అనిల్ రావిపూడి

''మటన్ సూప్' టైటిల్ బాగుంది. టీజర్ చాలా బాగుంది. దర్శకుడు రామచంద్ర, హీరో రమణ్, చిత్రయూనిట్‌కి అభినందనలు. ఈ నెల 10న రాబోతున్న ఈ చిత్రాన్ని అందరూ చూసి, పెద్ద విజయం అందించాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వం వహించిన చిత్రం 'మటన్ సూప్'. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్స్, భవిష్య విహార్ చిత్రాలు బ్యానర్లపై మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది. బుధవారం ఈ సినిమా టీజర్‌ను అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ– ''మా సినిమాని అందరూ పెద్ద హిట్ చేయాలి'' అని కోరారు. ''మంచి స్క్రీన్‌ప్లేతో మా చిత్రం రాబోతోంది'' అన్నారు మల్లికార్జున ఎలికా. ''నేటి ట్రెండ్‌కు తగ్గ కథ ఇది'' అని రామకృష్ణ సనపల, అరుణ్ చంద్ర వట్టికూటి చెప్పారు. ''మా దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమా రూపొందించారు'' అన్నారు రమణ్.



గోపాల్, రామచంద్ర, అనిల్ రావిపూడి, రమణ్

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



విరాజ్, యశశ్రీ రావు

విరాజ్ అశ్విన్, ప్రియదర్శిని రామ్, బాబూ మోహన్, యశశ్రీ రావు, పవన్ సిద్ధు, టేస్టీ తేజ, సూర్య గోపీనాథ్, శివన్నారాయణ ముఖ్య తారలుగా కొత్త సినిమాకి కొబ్బరికాయ కొట్టారు. వినోద్ గాలి రచన, దర్శకత్వంలో ఈటీవీ విన్‌తో కలిసి 90స్ కిడ్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం బుధవారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రవిశంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ క్లాప్ కొట్టగా, నిర్మాత ఎస్‌కేఎన్ దర్శకత్వం వహించారు. నిర్మాత బన్నీ వాసు, డైరెక్టర్ మెహర్ రమేశ్, ప్రసాద్ నిమ్మకాలయ, నిఖిల కోనేరు తదితరులు అతిథులుగా హాజరై, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ''బలమైన భావోద్వేగాలతో కూడిన బడ్డీ కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రెహాన్ షేక్, సంగీతం: సుహాస్.